క్లుప్తంగా

నిందితులను కఠినంగా శిక్షించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు

కడియం: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని, ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కడియం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మందపల్లి రత్నరాజు, ఆర్గనైజింగ్ డైరెక్టర్ ఈతకోట రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎల్ఎఫ్, అనుబంధ సంఘాలు నిరసన తెలిపారు. కడియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు యార్లగడ్డ సతీష్ మాదిగ, చింతపర్తి నాగేశ్వరరావు, కొడమంచిలి కోటి మాదిగ, పలివెల చినబాబు మాదిగ, కాకులపాటి సోమరాజు మాదిగ, చింతపర్తి సత్యనారాయణ మాదిగ, కొల్లి కొండరాజు మాదిగ, ముమ్మిడివరపు మహాలక్ష్మి మాదిగ పాల్గొన్నారు. నిరసన ర్యాలీ అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

'లేపాక్షి'లో డిస్కౌంట్ మేళా

సీటీఆర్ఐ: లేపాక్షి ఎంపోరియం నగర శాఖలో శనివారం నుంచి 2026 సంక్రాంతి వరకూ డిస్కౌంట్ మేళా నిర్వహిస్తున్నామని మేనేజర్ మోనిక శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్త కళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల మేరకు ఎంపిక చేసిన హస్తకళలు, చేనేత వస్త్రాలపై 10 శాతం నుంచి 30 శాతం వరకూ డిస్కౌంట్ ప్రకటించామన్నారు.

నగరపాలక సంస్థ అభివృద్ధికి కృషి చేద్దాం


మంత్రి దుర్గేష్‌తో కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనాకు మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ఇటీవల బదిలీపై రాజమహేంద్రవరం వచ్చిన రాహుల్ మీనా శుక్రవారం రాజమహేంద్రవరంలోని నివాసంలో మంత్రి దుర్గేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉద్యోగుల నుంచి అర్జీల స్వీకరణ


ప్రభుత్వ ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్ఓ సీతారామమూర్తి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉద్యోగుల ఫిర్యాదులను సమర్థంగా పరిష్కరించడం ద్వారా సేవా పారదర్శకత, నైతికత పెంపొందుతుందని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి డీఆర్ఓ ఫిర్యాదులు స్వీకరించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.మాధవరావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బాపిరాజు, ఇతర ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు జిల్లా యంత్రాంగం చూపిన చొరవకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

సినిమాలు



శ్యామల :	అరి
సూర్యమినీ :	ఓజీ
సూర్యప్యాలెస్ :	తెలుసుకదా
స్వామి :	తెలుసుకదా
అనుశ్రీ :	కె-ర్యాంప్
శివజ్యోతి :	డ్యూడ్
రాజా :	కె-ర్యాంప్
ఊర్వశి :	మిత్రమండలి
మేనక :	ఇడ్లీకొట్టు
రంభ :	డ్యూడ్
అప్సర :	కాంతారా-1
అశోక :	డ్యూడ్
నామవరం	
వీఎస్ మహల్ :	డ్యూడ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	డ్యూడ్
కడియం	
వెంకటసూర్య :	డ్యూడ్

కదలక.. వదలక..

- నగరంలో ట్రాఫిక్ కష్టాలు
- రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు
- పెరిగిపోయిన వాహనాలు
- కూడళ్లలో రద్దీ
- ముందుకు కదలక వాహన చోదకుల అవస్థలు
- వదలని ట్రాఫిక్ సమస్యలు



రాజమహేంద్రవరంలోని ఓ కూడలిలో వాహనాల రద్దీ

ప్రకాశం నగర్: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం రోజురోజుకూ విస్తరిస్తోంది. చదువు, ఉద్యోగం, వ్యాపారం, వైద్యం, బతుకుతెరువు కోసం అనేక మంది నగరానికి వస్తున్నారు. వీరిలో చాలామంది ఇక్కడే స్థిరపడుతున్నారు. అయితే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరంలో వసతులు పెరగడం లేదు. ముఖ్యంగా పెరిగిన జనాభా, వారి వాహనాలతో రోడ్లు ఇరుకుగా మారిపోయాయి. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యమయ్యాయి. పెరిగిన జనాభాతో పాటు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం కూడా ట్రాఫిక్ రద్దీకి ముఖ్య కారణం. ప్రధాన రోడ్లపై చిన్న వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేయడం, అక్కడకు వచ్చే కొనుగోలుదారులు రోడ్డుపై తమ వాహనాలను పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తద్వారా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

ప్రధాన కూడళ్లలో..

రాజమహేంద్రవరంలోని కంబాల చెరువు, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, దేవీచౌక్, జాంపేట, డీలక్స్ సెంటర్, కోటిపల్లి బస్టాండ్ తదితర ముఖ్య ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంది. ఇక్కడ రోడ్లు అసలే ఇరుకుగా ఉంటాయి. దీనికి తోడు సైకిల్, తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్లను ఆక్రమించి పూలు, పండ్లు, టిఫిన్ తదితర వాటిని విక్రయిస్తున్నారు. ముఖ్యంగా మొబైల్ టిఫిన్ సెంటర్లతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడి వాహనాలు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది.

రోడ్లపైనే..

నగరంలో ప్రధాన సెంటర్లలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కంబాల చెరువు సెంటర్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద ద్విచక్ర వాహనాలు, కార్లకు పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ, అక్కడ పువ్వులు, పండ్ల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఖాతాదారులు రోడ్డుపైనే తమ వాహనాలను నిలిపి వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి రోజూ సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగులు, వ్యాపారాలు చేసుకునే ప్రజలు.. తిరిగి తమ ప్రాంతాలకు వెళుతుంటారు. వీరితో పాటు పలు పాఠశాలలు, కళాశాలల బస్సులు సైతం ఆ సమయంలో రాకపోకలు సాగిస్తాయి.

పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు సన్నాహాలు

నగరంలోని వాహనాలను పార్కింగ్ చేసేందుకు నగరపాలక సంస్థ 84 చోట్ల పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. వీటిలో అధికంగా ప్రైవేటు స్థలాలున్నాయి. నగరంతో పాటు చుట్టు పక్కల విలీన ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రైవేటు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయనున్నారు. అక్కడ వాహనాల నిలుపుదలకు నిర్దేశించిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. వచ్చే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దేందుకు నగరపాలక సంస్థ చర్యలు చేపడుతోంది.


రోడ్డు పక్కనే నిర్వహిస్తున్న చిరు వ్యాపారం

పార్కింగ్ స్థలం లేక ఇబ్బంది



వాహనాలను నిలిపేందుకు సరైన పార్కింగ్ స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అలాగే ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండడంతో వాహనాలు ముందుకు కదలడానికి ఎక్కువ సమయం పడుతోంది. అనుకున్న సమయానికి గమ్యస్థానికి చేరుకోలేకపోతున్నాం. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బాషా, రాజమహేంద్రవరం

ప్రభుత్వ వైద్య కళాశాలలపై కూటమి కుట్ర

- పేదలకు వైద్య విద్యను దూరం చేసే ప్రయత్నం
- సర్కారు తీరుపై సమష్టిగా పోరాడదాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు
- జేగురుపాడులో రచ్చబండ



జేగురుపాడులో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

కడియం: ప్రభుత్వ వైద్య కళాశాలలపై కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై సమష్టిగా పోరాడదామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జేగురుపాడులో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో కోటి సంతకాల రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పేదలకు వైద్య విద్యను, మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. వాటిలో పది కళాశాలలను కూటమి సర్కార్ పీపీపీ పద్ధతిలో ప్రైవేటుపరం చేసేందుకు సిద్ధమైందన్నారు. ఈ నిర్ణయం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఒక ప్రజా ఉద్యమంలా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

పేదల జీవితాలతో చెలగాటం

మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ కల్తీ మద్యంతో ప్రజల జీవితాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెలగాటమాడుతున్నారని, బెల్టు షాపులతో దందా చేస్తున్నారని ఆరోపించారు. మద్యం దందాలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకుల పాత్రపై ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు వారడం ఖాయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శులు నక్కా శ్రీనగేష్, గిరజాల వీర్రాజు (బాబు) మాట్లాడుతూ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ ప్రజా సమస్య అని, కోటి సంతకాల సేకరణలో పార్టీలకు అతీతంగా ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సంతకాలు చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి విప్పర్తి ఫణి కుమార్, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి తిరుమలశెట్టి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ వెలుగుబంటి అచ్యుత రామ్, రూరల్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కొత్తపల్లి శివాజీ, మాజీ సొసైటీ అధ్యక్షుడు గారపాటి బుజ్జిబాబు, మండల వ్యవసాయ సలహా కమిటీ మాజీ అధ్యక్షుడు ఈలి గోపాలరావు, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి శివాజీ, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు సాక కిరణ్ కుమార్, కట్టా జమిందర్, మెల్లిమి గంగరాజు, అయినవిల్లి వెంకన్న, బోడపాటి సత్యనారాయణ, బుడ్డిగ లచ్చయ్య, అంగర రాజు, బోడపాటి చిన్నారావు, పెనుమాక శ్రీను, బట్టు చిన్ని పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు, జరిమానా


దొంగతనం కేసులో జైలు శిక్ష పడిన ధర్మరాజు, సూర్యచంద్రం

సీతానగరం: మండలంలోని కాటవరంలో జరిగిన దొంగతనం కేసులో రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకట నగరానికి చెందిన బండి ధర్మరాజు, సికిలే సూర్యచంద్రం (సురేంద్ర)కు మూడు నెలలు జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఏడవ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.బాబు తీర్పు చెప్పారు. ఈ వివరాలను ఎస్సై డి.రామ్ కుమార్ శుక్రవారం విలేకరులకు వివరించారు. 2021 నవంబర్ 29న కాటవరానికి చెందిన మేడిశెట్టి నాగరాజు ఇంటిలో జరిగిన దొంగతనంపై అప్పటి ఎస్సై శుభశేఖర్ కేసు నమోదు చేశారు. నిందితులు ధర్మరాజు, సూర్యచంద్రాన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఓలేటి మహాలక్ష్మి వాదనలు వినిపించారు. దొంగతనం కేసు నిర్ధారణ కావడంతో నిందితులకు పైవిధంగా శిక్ష విధించారు. సాక్షులకు సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుల్ ఎస్‌కే షరీఫ్‌ను నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్, కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై రామ్ కుమార్ అభినందించారు.

నిబంధనల మేరకే మద్యం షాపుల నిర్వహణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవరపల్లి కృష్ణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం షాపుల లైసెన్సులు పొంది తాము వ్యాపారం చేసుకుంటున్నామని నగరంలోని మద్యం షాపుల ఓనర్స్ అసోసియేషన్ నాయకులు దేవరపల్లి కృష్ణ, కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం(బాలు) అన్నారు. స్థానిక పాత సోమాలమ్మ గుడి వీధిలోని ఒక హోటల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మద్యం వ్యాపారాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడడం లేదన్నారు. రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సంభాషణ వీడియో వల్ల తాము చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. దానిలో ఉన్నవారికెవ్వరికీ మద్యం షాపు లైసెన్సులు లేవని, వారితో తమకు సంబంధం లేదన్నారు. ఏడాదిన్నర క్రితం మద్యం షాపులు టెండర్ పిలుస్తూ 20 శాతం కమీషన్లు ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని, అయితే ఇప్పుడు కేవలం 14 శాతం కమిషన్ మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. ఆ కమీషన్‌తో వ్యాపారం చేయడం వల్ల చాలా నష్టాల పాలవుతున్నామన్నారు. సమావేశంలో వక్కపాటి మురళి, ఆకుల శ్యామ్, మేక రమేష్, సత్తిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలి


కాంద్రేగులలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి

పెదపూడి: స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. కాంద్రేగుల గ్రామంలో శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో తడి, పొడి చెత్త సేకరించే విధానాన్ని పరిశీలించారు. ఇంటింటా తిరిగి ప్లాస్టిక్ గ్లాసులు, వస్తువులు, టైర్లు, రుబ్బురోలు మొదలగు వాటిలో నీరు నిల్వ ఉండకూడదని, ఆ నీటిని ప్రజలతో తొలగింపచేశారు. అనంతరం సచివాలయం అధికారులకు పారిశుద్య నిర్వహణపై సమీక్షించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి కర్రి విజయ శేఖర్ రెడ్డి, జేఏ సూర్యకళ, వీఆర్వో షేక్ కర్రిముల్లా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్రదీప్, సీఆర్పీ అనుసూరి సూర్యకుమారి, ఏఎన్ఎం లావణ్య, సచివాలయ గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి లక్ష్మీసాహిత్య, వెల్ఫేర్ అసిస్టెంట్ శివ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా వాడండి


కొంకుదురులో వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవిచంద్ర కుమార్

బిక్కవోలు: వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కొంకుదురులో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్ వాడాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహన చోదకులు బీమా, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సై వి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న సీతానగరం పీహెచ్‌సీ సిబ్బంది

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్యుల సమ్మెకు సంఘీభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌గోపాల్‌వర్మపై కేసు

కంబాలచెరువు: సినీ దర్శకుడు రామ్ గోపాల్‌వర్మపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కొద్ది రోజుల క్రితం ఒక షోలో వర్మను యాంకర్ స్వప్న ఇంటర్వ్యూ చేశారు. ఆ ప్రసారంలో యువతను పెడదోవ పట్టించే విధంగా ఇద్దరి వ్యాఖ్యలు ఉన్నాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వర్మ, స్వప్నలపై కేసు నమోదైంది.

త్యాగరాజుకు పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి, శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బొమ్మూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి యెనుముల త్యాగరాజును శుక్రవారం ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గొందేశి శ్రీనివాసులు రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సత్యసాయి అవతార వైభవంపై బుర్రకథ

రంగంపేట: సత్యసాయి అవతార వైభవంపై జిల్లా వ్యాప్తంగా బుర్ర కథల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు కోరారు. కోటపాడులో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు.

ముగ్గురికి జైలు

కడియం: మోటారు సైకిళ్ల చోరీ కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులకు ఆరు నెలల జైలు, రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఏడో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి.బాబు శుక్రవారం తీర్పునిచ్చారు. కడియం పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో రెండు మోటారు సైకిళ్ల చోరీలు జరిగాయి. ఆ కేసుల్లో పెంకే చంద, బర్ల చంద్రశేఖర్, శ్యామ్‌కుమార్‌పై నేరం రుజువు కావడంపై పై విధంగా తీర్పునిచ్చారు. నిందితులకు శిక్ష పడటంలో ఏపీపీ మహాలక్ష్మి, కేసు నమోదు చేసిన ఎస్సై నాగరాజు ముఖ్యపాత్ర పోషించారు. సాక్షులను కోర్టు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ప్రస్తుత కడియం ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు హాజరుపరిచారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

కంబాలచెరువు: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ సి.రమ్య ఒక్క రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు. ట్రాఫిక్ సీఐ ఎండీ అబ్దుల్ నబీ శుక్రవారం ఆ వివరాలు తెలిపారు. రాజమహేంద్రవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనచోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న 23 మందిపై కేసులు నమోదు చేశారు. వారిలో 18 మందికి ఒకొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

క్రీడల్లో విద్యార్థినుల సత్తా

ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన 69వ అంతర్ జిల్లాల అండర్ -19 బాయ్స్ బాలుర, బాలికలు బాక్సింగ్, ఉషూ చాంపియన్ షిప్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు రెండు కాంస్య పతకాలు సాధించినట్లు కందుకూరి రాజ్యలక్ష్మి స్త్రీల కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి తెలిపారు. బాక్సింగ్ 45-48 కేజీల విభాగంలో కె.మహా హాసిని కాంస్య పతకం, ఉషూ 75 కేజీల విభాగంలో టి.విష్ణు ప్రియ కాంస్య పతకాలు గెలుచుకున్నారన్నారు.

పెళ్లికి వెళ్లి వస్తూ.. మృత్యు ఒడికి..


బందెల రామాంజనేయులు (ఫైల్)

కడియం: వెంకాయమ్మపేట వద్ద జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బందెల రామాంజనేయులు (23) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం .. ర్యాలీ గ్రామానికి చెందిన మహేష్ గురువారం మధ్యాహ్న సమయంలో ఇంటి వద్ద ఉన్న రామాంజనేయులును తన బైక్‌పై ఎక్కించుకుని జగ్గంపేట వివాహానికి తీసుకువెళ్లాడు. అనంతరం తిరిగి రాత్రి సమయంలో ఇంటికి వెళుతుండగా వెంకాయమ్మపేట వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కింద పడిన రామాంజనేయులుపై వెనుక వచ్చిన లారీ ఎక్కేసింది. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం ఎస్సై ధనలక్ష్మీ ప్రసన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ప్రమాదంలో రామాంజనేయులు మృతి చెందడంతో మహేష్ అక్కడ నుంచి బైక్‌తో వెళ్లిపోయాడు. కానీ ఇంటికి చేరకపోవడంతో అతడి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఫ్యూచర్ ఫౌండర్స్ కార్యక్రమం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో సంస్థ డైరెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమలశాఖాధికారి వనిధర్ రామన్ శుక్రవారం ఫ్యూచర్ ఫౌండర్స్ కార్యక్రమం నిర్వహించారు. యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం, ప్రభుత్వ ఎంఎస్ఎంఈ ద్వారా అందించే ప్రోత్సాహకాలు, యువ పారిశ్రామిక వేత్తలకు నైపుణ్య అభివృద్ధి, తదితర అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు.